క్లుప్తంగా

ఇళ్ల దరఖాస్తు గడువు పొడిగించాలి

హుజూర్‌నగర్ : పట్టణంలోని రామస్వామి గట్టు వద్ద ఉన్న ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడిగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తు గడువును ఈనెల 4వరకే ఇచ్చారని, దీంతో రెండు రోజులు ప్రభుత్వ సెలవులు ఉన్నందున దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందులు ఉన్నాయని, అందుకు గడువు పొడిగించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు బ్రహ్మం, సైదులు, మురళి, లింగమ్మ, తదితరులు ఉన్నారు.

విద్యార్థికి అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న శ్రీనివాసరెడ్డి

మునగాల : మండలంలోని రేపాల గ్రామానికి చెందిన కుదుపుగంటి శరత్‌బాబు కుమారుడు చందుభార్గవ్ అపో మెడికల్ అకాడమీలో శిక్షణ పొంది అపోలో మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. దీంతో ఆదివారం హైదరాబాద్‌లోని కళాశాల ఆవరణలో అపోలో మెడికల్ అకాడమీ డైరెక్టర్ పోసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అలువాల మధుసూధన్ చందుభార్గవ్‌ను అభినందించి పూలమాల, శాలువాతో సత్కరించారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కొల్లు పాపయ్య చౌదరి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సామినేని శ్రీనివాసరావు ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన పీఆర్‌టీయూ జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శ్రీనివాసరావు గతంలో రెండుసార్లు మండల అధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా, ఒకసారి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పనిచేశారు. మళ్లీ రెండోసారి అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల మండల అధ్యక్షుడు కొంపెల్లి గోపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు కంటి వైద్యశిబిరం

కోదాడరూరల్ : పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో మంగళవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు ఈశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెల్త్‌కార్డులు ఉన్న వారితో పాటు ఆరోగ్యశ్రీ కార్డులున్న వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయబడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఈనెల 3న (మంగళవారం) ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.సోమయ్య, కె.వీరారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులు వారిపై ఆధారపడిన వారు, ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డు ఉన్న వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు.

బీఆర్‌ఎస్ నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న నాయకులు

నడిగూడెం : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నడిగూడెం గ్రామ అధ్యక్షుడిగా భోనగిరి ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా కాసాని సతీష్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు అభినందించారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను భవన నిర్మాణ కార్మికులకు అమలు చేయాలని ఆ సంఘం మండల నాయకులు ముస్తఫా అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మోటార్ సైకిళ్లను ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సోమయ్య, వేణు, వెంకన్న, రాంబాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


హుజూర్‌నగర్ : శ్రమదానం చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

హుజూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపాలిటీలో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా పట్టణంలోని ముత్యాలమ్మ గుడి ప్రాంతంలో రోడ్లను ఊడ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో డంపింగ్‌యార్డ్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తొలుత ముత్యాలమ్మగుడిలో ఎమ్మెల్యే సతీమణి రజితతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, పురపాలక, మెప్మా ఆర్‌పీలు, సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

శ్రమదానంలో పాల్గొన్న అదనపు కలెక్టర్, ఆర్డీఓ..

పట్టణంలో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ శ్రమదానంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, కమిషనర్ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు అన్నారు. ఆదివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛత ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, బీఆర్‌ఎస్ పట్టణ ఇన్‌చార్జి కొణతం సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు వేమూరి నాగవేణినారాయణ, లలితాభరత్, భాష, సాయి, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మార్కెండేయ, మత్స్యశాఖ చైర్మన్ పేరబోయిన వీరయ్య, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, నాయకులు సుంకు శ్రీను, రాములు, మారయ్య, రమాదేవి, నరేష్, భిక్షం, రాజేష్ తదితరులున్నారు.

కోదాడరూరల్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చిన స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలోని తమ్మర ఎంపీఐ కార్యాలయం ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ శక్తి కేంద్రం అధ్యక్షుడు కనగాల పుల్లయ్యచౌదరి, తమ్మినేని జనార్దన్‌రావు, వంగవీటి శ్రీనివాసరావు, కనగాల మధుసూదన్‌రావు, లక్ష్మయ్య, శివప్రసాద్, రవీందర్‌రెడ్డి, కోటి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు

హుజూర్‌నగర్ రూరల్ : గ్రామ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొప్పుల సైదిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమరవరంలో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు ర్యాలీలో సర్పంచ్ గుజ్జుల సుజాతఅంజిరెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలోని వీధులను శుభ్రం చేశారు. తదనంతరం గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలసైదులు, కార్యదర్శి, పలువురు వార్డుసభ్యులు, ఆశా కార్యకర్తలు, గ్రామపెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమదానాలు.. వయోవృద్ధులకు సన్మానాలు

మఠంపల్లి : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా మండలంలో ఆదివారం వాడవాడలా శ్రమదానాలు.. వయోవృద్ధులకు సన్మానాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సముదాయంలో ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ మామిడి జానకిరాములు తదితరులు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అదేవిధంగా మండలంలో పలు గ్రామాలకు చెందిన వయోవృద్ధులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సయ్యద్‌బీబీ కుతుబ్, సునీతా లాలూనాయక్, నాగునాయక్, పఠాన్‌జానిబీ హఫీజ్‌ఖాన్, బచ్చలకూరి అఖిలబాబు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : తహసీల్దార్ కార్యాలయంలో శ్రమదానం చేస్తున్న అదనపు కలెక్టర్, ఆర్డీఓ

చెన్నకేశ్వాపురంలో శ్రమదానం

నడిగూడెం : మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో ఉన్న కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, జానయ్య, గౌరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.


మఠంపల్లిలో రోడ్లు ఊడ్చి శ్రమదానం చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ, సర్పంచ్‌లు


నేరేడుచర్లలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు


కోదాడరూరల్ : శ్రమదానంలో పాల్గొన్న బీజేపీ నాయకులు


హుజూర్‌నగర్‌రూరల్ : స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచులు

సామాజిక సేవలో పబ్లిక్ క్లబ్ ముందుండాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


కోదాడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడ : సామాజిక సేవా కార్యక్రమాల్లో పబ్లిక్ క్లబ్ ముందుండాలని, క్లబ్ నిర్వహించే సామాజిక కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో క్లబ్ అధ్యక్షుడు వక్కంతుల నాగార్జున అధ్యక్షతన పబ్లిక్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు ఆధునీకరించిన కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియాన్ని ఆయన ప్రారంభించారు.

ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్యే..

పబ్లిక్‌క్లబ్ సమావేశానికి సభ్యుడి హోదాలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు హాజరయ్యారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన కార్యవర్గ ఎన్నికలో గతంలో పాటించిన సంప్రదాయాన్ని పాటిస్తూ అందరూ కూర్చొని ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలన్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు కల్పించుకుని ఎన్నికలు జరగాల్సిందేనని పట్టుబట్టారు. దీనికి ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. మీ హయాంలో ఇంటి దగ్గర కూర్చొని కార్యవర్గాన్ని రాసు కోలేదా.. అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొంది. వెంటనే క్లబ్ సభ్యులు కల్పించుకొని ఇద్దరిని శాంతింపజేశారు.

ఎన్నికలు జనవరి 21కి వాయిదా..

ఈ సమస్య పరిష్కారానికి ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. వారు దీనిపై చర్చించి ఎన్నికలను వచ్చే సంవత్సరం జనవరి 21న జరపాలని, అప్పటి వరకు ప్రస్తుత కార్యవర్గాన్నే కొనసాగించాలని నిర్ణయించారు. అందుకు సభ్యులు ఆమోదించడంతో సమావేశం ముగిసింది. కార్యక్రమంలో పబ్లిక్‌క్లబ్ కార్యదర్శి వల్లూరి రామిరెడ్డి, గుడుగుంట్ల శంకర్, కరుణాకర్, రాధాకృష్ణమూర్తి, మేకల వెంకట్రావ్, రావెళ్ల సీతరామయ్య, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, గంట సత్యనారాయణ పాల్గొన్నారు.

కళారంగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

కళలకు, కళారంగానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారం అవార్డు అందుకున్న కేఆర్‌ఆర్ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు వేముల వెంకటేశ్వర్లు అభినందన సభ ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్‌తో కలిసి వేముల దంపతులను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోదాడ ప్రాంతానికి పేరు తెచ్చిన వేముల అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి గణేష్, అందె సత్యం, పారా సీతయ్య, గంధం బంగారు, ఉస్తేల సృజన, పిల్లుట్ల శ్రీనివాస్, బద్దం భద్రారెడ్డి, వంగవేటి రామారావు, రాయపూడి చిన్ని, షేక్ మీరా, వెంపటి మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతీకొండానాయక్

మఠంపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎంపీపీ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ జగన్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య అన్నారు. ఆదివారం మండలంలోని బక్కమంతుల గూడెంలో జరిగిన ఆ పార్టీ బూత్‌స్థాయి కమిటీల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీలపై ప్రచారం చేసి రానున్న ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మన్నెం శ్రీనివాసరెడ్డి, బేతా విజయ కుమారీవెంకటరెడ్డి, ఎంపీటీసీ నాగిరెడ్డి, బల్లునూరి వెంకటరెడ్డి, కొండేటి సుధాకర్‌రెడ్డి, మామిడి శ్రీను, కొమ్ము సైదులు, కనకయ్య, రవీందర్ నాయక్, చిట్యాల నర్సిరెడ్డి, రాజీవ్ పాల్గొన్నారు.

రుక్కారావుకు చదరంగంలో ప్రథమ బహుమతి


రుక్కారావును సన్మానిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన తెలంగాణ ఆల్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ జాయింట్ సెక్రటరీ డా.నరాల రుక్కారావు ఆదివారం కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వయోవృద్ధుల ఆటల పోటీల్లో పాల్గొని చదరంగంలో ప్రథమ స్థానం సాధించినందుకు బహుమతి అందజేసినట్లు తెలిపారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవంలో తనకు ఎంతగానో గుర్తింపు లభించిందని, కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ప్రతిఒక్కరూ ఓటును సరిచూసుకోవాలి


కోదాడరూరల్ : చెక్ యువర్ ఓట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్

కోదాడరూరల్ : ప్రతిఒక్కరూ తమ ఓటును ఓటర్ జాబితాలో స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో సరిచూసుకోవాలని ఆర్డీఓ సూర్యనారాయణ సూచించారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో చెక్ యువర్ ఓట్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ఓట్ చెక్ చేసుకొనే అవకాశాన్ని కల్పించామన్నారు. ఓటరు జాబితాలో పేరులేని వారు నూతన ఓటు కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాయిగౌడ్, డీటీ, ఆర్ఐ, బీఎల్‌ఓలు ఉన్నారు.

ఓటరు సవరణ జాబితాల పరిశీలన

అనంతగిరి : మండలంలోని పలు గ్రామాల్లో సవరించిన ఓటరు జాబితాను ఓటరు సవరణ జాబితా పరిశీలన అధికారి నాగారం తహసీల్దార్ బ్రహ్మయ్యతో కలిసి స్థానిక తహసీల్దార్ రవి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అమీనాబాద్, అనంతగిరి, త్రిపురవరం, మెగలాయికోట, ఖానాపురం, వెంకట్రాంపురం గ్రామాల్లో సవరించిన ఓటరు జాబితాను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ జాని, సీనియర్ అసిస్టెంట్ జానకిరాంరెడ్డి, లక్ష్మారెడ్డి, కార్యదర్శులు, సిబ్బంది, బీఎల్‌ఓలు ఉన్నారు.

ఓటర్లకు సన్మానం

చిలుకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఆదివారం ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సీనియర్ సిటీజన్ దొడ్డా నారాయణరావు, నూతన ఓటర్లను రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరిత మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, ఆర్ఐ మంత్రిప్రగడ సీతరామచందర్‌రావు, మంజుల, ఏఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల అభ్యంతరాలపై విచారణ

మండలంలో 775ఓట్లపై అభ్యంతరాలు రావడంతో వాటిని పరిశీలించేందుకు ప్రత్యేక అధికారిగా పాలకవీడు తహసీల్దార్ శ్రీదేవిని కలెక్టర్ నియమించారు. దీంతో ఆమె ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. అభ్యంతరాల ఓట్లు స్థానిక రెవెన్యూ అధికారులు పరిశీలించి తొలగించడంతో వాటిని మరో మారు ఆమె పరిశీలించారు. డబుల్ ఓట్లు, నకిలీ ఓట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి తొలగించాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ సరిత, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, ఆర్ఐలు మంజుల, సీతయ్య, జూనియర్ అసిస్టెంట్ వీరన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అనంతగిరి : ఓటరు సవరణ జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య


చిలుకూరు : అభ్యంతరాల ఓట్లపై విచారణ చేస్తున్న ప్రత్యేక అధికారి శ్రీదేవి, తహసీల్దార్ సరిత

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


హుజూర్‌నగర్ : మాట్లాడుతున్న శీలం శ్రీను


కోదాడ : మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

హుజూర్‌నగర్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను డిమాండ్ చేశారు. పట్టణంలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యూనిఫామ్, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ప్రమాద బీమా, గుర్తింపు కార్డు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు సూరమ్మ, లక్ష్మి, నాగమణి, సత్యవతి, లక్ష్మి, వరలక్ష్మి, పద్మ, సామ్రాజ్యం, వెంకటమ్మ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వినూత్న నిరసన

కోదాడ : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు ఆదివారం కోదాడ ఎంఈఓ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేసిన మెనూను మార్చాలని, పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, గౌరవ వేతనాన్ని వెయ్యి నుంచి మూడు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముత్యాలు, అన్నపూర్ణమ్మ, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారం నాలుగోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వేతనాలు పెంచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శాంతాకుమారి, ధనమ్మ, మంగయ్య, లచ్చీరాం, మహాలక్ష్మమ్మ, పద్మ, సాలమ్మ, లత పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్తులను బీసీ ఏ లో చేర్చాలి


కరపత్రం విడుదల చేస్తున్న ముదిరాజ్‌లు

చిలుకూరు : ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి చేర్చాలని ఆ సంఘం నియోజకవర్గ కన్వీనర్ ముసి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బేతవోలు గ్రామంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రస్తుతం ప్రకటించిన సీట్లులో ముదిరాజ్‌లకు ఒక్కటి కూడా కెటాయించకపోవడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. నియోజవర్గంలో ముదిరాజ్‌ల ఓట్లును అడిగే హక్కు అ పార్టీకి లేదన్నారు. అనంతరం ముదిరాజ్‌ల మేము ఎంతో మాకు అంతా అనే నినాదంతో రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం సంఘం గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుడిగె నాగేశ్వరరావు, కార్యదర్శిగా గణపారపు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఉపేందర్, నాగేశ్వరరావు, పిట్టల సతీష్, పెదవీరయ్య, వెంకటనారాయణ, నర్సయ్య, అచ్చయ్య, మల్లేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ముసి మట్టయ్య, అల్లి వీరబాబు, కాకి సీతరాములు, సారగండ్ల సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో జడ్జీల పూజలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో మల్కాజ్‌గిరి కోర్టు సబ్ జడ్జి జీవీ మహేష్‌నాథ్, హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్ వేర్వేరుగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కొండారెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, పోలీస్, ఆలయ సిబ్బంది తదితరులున్నారు.

యువత ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న కొండల్

మునగాల : విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం నేటి యువత పాలకవర్గాలపై ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండల్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని చిల్లంచర్ల రఘునాథం స్మారక భవనంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి, యువజన, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై నేటి యువత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాల్లో పాల్గొనాలని కోరారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లేదా వారికి నిరుద్యోగ భృతి చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండగోని శ్రీను, ఉపాధ్యక్షుడిగా అనంతుల మధు, ప్రధాన కార్యదర్శిగా సట్టు రాము, సహాయ కార్యదర్శిగా కాసిన నరేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్, ఏఐవైఎఫ్ నాయకులు శివ, వినయ్, నరేందర్, నరేష్, ప్రణయ్, అనిల్, ఉమేష్, నందు, గోపి, మధు తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి

కోదాడరూరల్ : వయోవృద్ధులు, తల్లిదండ్రుల సంరక్షణ హక్కు చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని అఖిల భారత సీనియర్ సిటీజన్స్ సమాఖ్య కార్యవర్గ సభ్యుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డివిజన్ స్థాయిలో వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలని అన్నారు. సీనియర్ సిటీజన్స్‌కు ప్రభుత్వం పలు రకాల వసతులను కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు గడ్డం నరసయ్య, సభ్యులు హరిబాబు, నరసయ్య, భిక్షం, రంగారావు, వరప్రసాదరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

హుజూర్‌నగర్ : ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లికి చెందిన మాతంగి రమేష్, కూరాకుల సైదులు ద్విచక్రవాహనంపై కోదాడకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో పట్టణ శివారులోని మాధవరాయనిగూడెం స్టేజీ సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో రమేష్‌కు తలకు తీవ్రంగా గాయాలు కాగా సైదులుకు స్వల్పగాయాలయ్యాయి. గమనించి స్థానికులు వారిని స్థానిక ఏరి యా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రమేష్‌ను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈవిషయమై పోలీసులు ఫిర్యాదు అందలేదన్నారు.

లేబర్‌కార్డు రెన్యువల్ చేయించుకోవాలి

హుజూర్‌నగర్ : భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డు రెన్యువల్ చేయించుకోవాలని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు షేక్ సైదా అన్నారు. ఆదివారం పట్టణంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్‌కార్డు లేని వారు కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వినాయకరావు, ఏలియ, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారావు, రాధారెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ కల్పించాలి

హుజూర్‌నగర్ : గృహలక్ష్మి పథకంలో ప్రభుత్వం దివ్యాంగులకు కల్పించిన రిజర్వేషన్ ప్రకారం పట్టణంలోని రామస్వామి గట్టు వద్ద ఉన్న ఇళ్ల పంపిణీలో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని ఆకుల రాము కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన దివ్యాంగుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో పిచ్చయ్య, పాపయ్య పాల్గొన్నారు.